క్లుప్తంగా

18న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

రాజాం సిటీ: స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈ నెల 18న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నామని ఏడీ ఫణీంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయాలని ఆయన కోరారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, ఎస్.మలసిమణి, షేక్ బాబర్, ఎస్.మురళీకృష్ణ హాజరుకానున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంతాపం


లక్షుంనాయుడు(ఫైల్)

బాడంగి: మండలంలోని ముగడ గ్రామానికి చెందిన పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ తెంటు లక్షుంనాయుడు(92) మంగళవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. ఈయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ లక్షుంనాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

అయ్యప్ప విగ్రహాల ఊరేగింపు


కంచరాంలో అయ్యప్పవిగ్రహాలకు తిరువీధి

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో అయ్యప్పస్వామి విగ్రహాలను మంగళవారం ఊరేగించారు. మకర సంక్రాంతి సందర్భంగా వీటి తిరువీధి నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త టంకాల పాపినాయుడు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ తిరువీధి ఉత్సవంలో పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న యువజన సంఘం సభ్యులు

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ అన్నారు. బుధవారం మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలసలో శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారా కాలుష్యం బారి నుంచి బయటపడవచ్చునని పేర్కొన్నారు. ఖాళీ స్థలాలు, చెరువు గట్టు, పొలాల్లో మొక్కలు విరివిగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు గార సత్యనారాయణ, రెడ్డి శ్రీనివాసరావు, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి మంచి చేయాలి

రేగిడి: ప్రతి ఒక్కరూ సమాజానికి మంచి చేయాలన్న ఆలోచన ఉంటే ఏదైనా సాధించవచ్చని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు. రేగిడి గ్రామంలో రూ.60 లక్షలతో వేణుగోపాలనాయుడు నిర్మించిన విశ్వసాయి మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపాదనలో కొంత భాగాన్ని దైవ కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా వేమకోటి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు, రుత్విక్‌లు వేమకోటి ప్రసాద్‌శర్మ, అంపోలు రామ్ ప్రసాద్‌శర్మ, వేమకోటి జానకీరామ్ శర్మ, హరీష్ పాల్గొన్నారు.


బొబ్బిలి రూరల్: అలజంగి గ్రామంలో పతంగాలతో చిన్నారులు, పెద్దలు

సందడే.. సందడి

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి, కనుమ పండగలు మంగళ, బుధవారాల్లో సందడిగా జరిగాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ సరదగా సందడి చేశారు. ముత్యాల ముగ్గుల్లో గొబ్బెమ్మలు పెట్టి సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు చేశారు. కనుమ రోజు పశువులను పూజించారు. కొత్త దుస్తులు ధరించి అంతా సందడిగా గడిపారు. ఏడాదికొకసారి వచ్చే పండగలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు, బంధుగణంతో పల్లెలు కలకలలాడాయి. – సాక్షి నెట్‌వర్క్


తెర్లాం: సంక్రాంతి పండగ సందర్భంగా కొరటాంలో రంగవల్లులు



తెర్లాం:చూపరులను ఆకట్టుకున్న కొరటాంలో చిన్నారుల వేసిన హ్యాపీ పొంగల్ అనే ముగ్గు


రామభద్రపురం: ఇంటి ముందు గొబ్బెమ్మలు వేసి గొబ్బెమ్మలాడుతున్న మహిళలు


వంగర: కొప్పరలో అగ్నిపథ్‌కు ఎంపికైన యువకులు, వారి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు


సంతకవిటి: మద్దూరుపేటలో సంప్రదాయ దుస్తుల్లో చిన్నారుల సందడి


వంగర: అరసాడలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు


బొబ్బిలి : పోటీలకు గాలిపటాలను సిద్ధం చేసిన చిన్నారులు

పాలవలసకు ఘన నివాళి

వంగర: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజకీయ కురువృద్ధుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం భౌతికకాయానికి వంగర మండల నేతలు బుధవారం ఘన నివాళి అర్పించారు. వంగర మండలంతో పాలవలస కుటుంబానికి వందేళ్ల పైబడి అనుబంధం ఉంది. చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి నాయకుల వరకు పేరుపెట్టి ఆప్యాయత, అనురాగాలను పంచిపెట్టారు. అందరి నోటా గురువుగారూ అంటూ సంబోధించే గొప్ప నాయకుడు రాజశేఖరం. తనతో నడిచేవారిని ఒక కుటుంబంగా భావించారు. ఆయనతో కలసి నడిచిన వేలాది మంది వివిధ పార్టీల నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు, ప్రజలు, బంధువులు ఆయన మృతితో శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన పార్థివ దేహాన్ని చూసేందుకు పండగను సైతం లెక్క చేయకుండా పాలకొండ పట్టణానికి వెళ్లి ఆయనకు నివాళి అర్పించారు. పాలవలస కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాజశేఖరం మృతి తీరని లోటని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ,


రాజశేఖరం పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న వంగర మండల నాయకులు

జెడ్పీటీసీ కరణం రాధమ్మ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కరణం సుదర్శనరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. రాజశేఖరం సతీమణి, రేగిడి జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతితో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధితులకు అండగా...

సంతకవిటి: సిరిపురం గ్రామ పొందరవీదిలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు దాతలు అండగా నిలిచారు. సర్పంచ్ డోల తిరుపతి విజ్ఞప్తి మేరకు సుమారు రూ.3.23 లక్షలను బాధితులకు అందజేశారు. మంతిరెడ్డి ముద్దమ్మ తమ కుమార్తె ఈసు వివాహం ఏప్రిల్ 18న జరగనుండగా వివాహ నిమిత్తం దాచుకున్న నగదు, బంగారం కాలిపోయాయి. వారికి బాసటగా లంక అచ్చియ్యమ్మ, రాజాపు చిన్నారావు, లంక లక్ష్మీదేవి, అధికార్ల అప్పారావు, రామదాసు పార్వతి, మంతిరెడ్డి సన్నడు, మంతిరెడ్డి సూర్యనారాయణ, అధికార్ల లక్ష్మణరావు, అధికార్ల


బాధితురాలికి నగదు అందజేస్తున్న దాతలు

అప్పన్న, పాత్రుని మల్లేశ్వరరావు తమ వంతు సాయం అందజేశారు. మొత్తంగా రూ.3.23 లక్షలు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వీరికి సర్పంచ్ తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

సిరులు కురిపిస్తున్న ఉసిరి

- సీతాకాలంలోనే పంట దిగుబడి
- విలువైన పోషకాలు కలిగే ఉసిరి

బొబ్బిలి రూరల్: కార్తీక మాసం నుంచి శీతాకాలం చివరి వరకు దొరికే అరుదైన ఫలం ఉసిరి. సి విటమిన్ నిండుగా ఉన్న ఉసిరికి కాయలో ఎన్నో పోషకాలు దాగి ఉన్నాయని మన పెద్దలతో పాటు పురాణాలు, ఆయుర్వేద గ్రంథాల్లో దీని ప్రాముఖ్యతను వివరిస్తు ఎన్నో కథలు ఉన్నాయి. నేటి శాస్త్రవేత్తలు సైతం వైద్య రంగంలో ఉసిరిలో దాగి ఉన్న పోషకాలపై ఎన్నో పరిశోధనల ద్వారా మనకు తెలియజేస్తున్నారు. దీంతో నేడు ప్రస్తుతం ఉసిరి పంట రైతులకు సిరులు కురుపిస్తోంది. కేజీ ఉసిరి కాయలు 150 రూపాయిల వరకు బహిరంగ మార్కెట్లో ధర పలుకుతుండగా అంతరించిపోతున్న జాతి జాబితోలో ఉన్న ఉసిరి కాయలు నేడు మార్కెట్లో లభ్యం కావడంతో వినియోగదారులు ఎగబడి కొనుగోలు


మార్కెట్లో లభ్యమవుతున్న ఉసిరి

చేస్తున్నారు. చిన్న వయసులోనే నెరిసిపోతున్న తల నీలాలకు, దగ్గు, జలుబు వంటి జబ్బులకు ప్రాథమికంగా వాడే దివ్య ఔషధంగా వాడే ఉసిరి నేడు పట్టణ వాసులకు అందుబాటులో దొరుకుతోంది. బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి వీటిని దిగుబడి చేసుకుంటున్న చిరు వ్యాపారులు వీటి అమ్మకాలతో మంచి ఆదాయం ఆర్జిస్తూ సంబరపడుతున్నారు.

పొ(ప)గ మంచు



పొగ మంచుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఉదయం 8 గంటల వరకూ పొగమంచు దట్టంగా కురవడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం కూడా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనబడని విధంగా పొగమంచు కురిసింది. – రేగిడి

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. బండి సత్యవతి జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహించినట్లు జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు తెలిపారు. మొత్తం 48 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొనగా ముగ్గురు విజేతలకు బహుమతులు అందించారు. విజేతలకు సత్యవతి కుటుంబ సభ్యులు జ్ఞాపికలు అందజేసారు.


పెనుబాకలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ బండి నర్సింహులు తదితరులు

పేదలకు వస్త్రదానం


రామభద్రపురం : పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న తూముల దాలయ్య దంపతులు


తెర్లాం:రంగప్పవలసలో దుస్తులు పంపిణీ చేస్తున్న వీఆర్‌ఓ


రాజాం సిటీ: పేదలకు దుస్తులు అందిస్తున్న దాత

రామభద్రపురం:

సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తూముల దాలయ్య కుటుంబ సభ్యులు సుమారు 400 మంది పేదలకు మంగళవారం వస్త్రదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. మగవారికి పంచ, దుప్పటి తువ్వాలు, పండ్లు, ఆడవారికి చీర, దుప్పటి, పండ్లు చొప్పున్న అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ వస్త్రదానం చేయడం వల్ల ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తూముల గోపాలకృష్ణ, తూముల జగదీష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూత

రేగిడి: మండలంలో లింగాలవలస గ్రామానికి చెందిన అదపాక చిరంజీవినాయుడు తన తల్లి సీతమ్మ జ్ఞాపకార్థం సంక్రాంతి సందర్భంగా 400 మంది పేదలకు మంగళవారం వస్త్రదానం చేశారు. గత పది సంవత్సరాలుగా లింగాలవలస, చినలింగాలవలస, తోకలవలస, వావిలవలస గ్రామాలకు చెందిన వృద్ధులకు, వితంతువులకు వస్త్రదానం చేస్తున్నట్లు చిరంజీవినాయుడు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద సైలాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని నిరుపేదలకు మండల వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు, రంగప్పవలస గ్రామ వీఆర్‌ఓ సువ్వాడ నరసింహనాయుడు సంక్రాంతి పండగ సందర్భంగా బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రతీ ఏటా సంక్రాంతి పండగ పురస్కరించుకొని ఎం.ఆర్.అగ్రహారం, రంగప్పవలస, కాలంరాజుపేట గ్రామాల్లోని నిరుపేదలకు దుప్పట్లు, లుంగీలు, టవల్స్ పంపిణీ చేస్తుంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి, తమ్ముడు జ్ఞాపకార్థం ఏటా నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తుంటానని ఆయన తెలిపారు.

రాజాంలో...

రాజాం సిటీ: పట్టణ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాయాధికారి ఎస్‌వీ రమణ పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. మంగళవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది మాదిరిగానే గ్రామంలోని 400 మంది వృద్ధులు, పేదలకు చీరలు, దుప్పట్లు అందజేశారు.


రేగిడి : లింగాలవలసలో పేదలకు వస్త్రదానం చేస్తున్న దాత చిరంజీవినాయుడు

కలుషితమవుతున్న తాగునీరు

- అపారిశుద్ధ్యంతోనే ప్రజల సహవాసం
- మురుగు కాలువల్లోనే తాగునీటి పైపులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. తాగునీరు కలుషితం అయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో శానిటేషన్ అధ్వానంగా ఉంది. ఎక్కడ పడితే అక్కడే చెత్త చెదారం పేరుకుపోయాయి. కాలువల్లో పూడికలు నిండిపోయి ఉన్నాయి. మురుగు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలకు ఆవాస కేంద్రాలుగా మారి ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. తాగునీటి పైపులైన్లు మురుగు కాల్వల్లోనే ఉన్నాయి. దీంతో తాగునీరు పైపులైన్లలో మురుగు నీరు చేరే ప్రమాదం పొంచి ఉన్నా సచివాలయ సిబ్బంది పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులన్నీ కాలువలు లేక, ఉన్నవాటిలో పూడికలతో నిండిపోగా, ఆ మురుగులో కాలువల్లోంచి వెళ్తూ.. తాగునీటిపైపులు గ్రామంలో ఎక్కడ చూసినా కలుషిత జలాల జాడలే కనిపిస్తున్నాయి. పల్లె పండగ ద్వారా చేపట్టాల్సిన కాలువలు, రహదారుల పనులు రాజకీయ నాయకుల నిర్వాకంతో పడుకున్నాయి. శానిటేషన్‌పై పర్యవేక్షణలో అధికార సిబ్బంది లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నివాసాల మధ్య పెంటకుప్పలు, పశువుల శాలలు ఉండడంతో రోగాల సమస్య తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉంది. అయినా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన వారు స్పందించడం లేదన్న విమర్శలు గ్రామస్తుల నుంచి వస్తున్నాయి. సచివాలయ సిబ్బంది ఉన్నా లేనట్లేనని, ప్రజా ధనాన్ని ప్రభుత్వాల నుంచి పనికి తగ్గ వేతనాలను పుచ్చుకుని చేయాల్సిన పనులు, బాధ్యతలను విస్మరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధుల నుంచి సరైన స్పందన కరువైందని అందుకే మాకీ సమస్యలని చెబుతున్నారు. ఇకనుంచైనా శానిటేషన్ సమస్యలకు చెక్ చెప్పేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ పప్పు రవికుమార్ వద్ద ప్రస్తావించగా ఇప్పటికే శానిటేషన్, కాలువల నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిచ్చామన్నారు. త్వరలోనే కాల్వల్లోని మురుగు, పైపుల తొలగింపుపై చర్యలు చేపడతామన్నారు.


గ్రామ సచివాలయం ఎదుట మురుగునీరు నిల్వ


మురుగుకాల్వలనుంచి వెళుతున్న తాగునీటి పైపులైన్లు

సారథిలో దుస్తుల పంపిణీ

రాజాం సిటీ: మానవసేవే మాధవ సేవ అని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మున్సిపాల్టీ పరిధి సారధి గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కిల్లారి శ్రీనివాసరావు సమకూర్చిన దుస్తులను పేదలకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సహృద్భావ వాతావరణం నెలకొంటుందని అన్నారు. పేదల కుటుంబాల్లో ఆనందాన్ని చూసేందుకు తనకు ఉన్న దాంట్లో కొంత మొత్తం వెచ్చించి సేవ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. సుమారు 5 వేల మందికి దుస్తులు పంపిణీ చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, దూబ గోపాలం, ఫోరం ఫర్ బెటర్ రాజాం సభ్యులు మజ్జి మదన్‌మోహన్, వారాడ వంశీకృష్ణ, మజ్జి పెంటన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ తలే రాజేష్